క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదవలస, లక్కవరపేట, దేవరాపల్లి పంచాయతీల్లో ఆయన బుధవారం పర్యటించారు. సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

ఏజెన్సీలో ఆదివాసీలకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



రాధాకృష్ణ

పాడేరు రూరల్: గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకే వందశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు బూడిద మాధవరావు, కిరసాని కిషోర్ డిమాండ్ చేశారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మహిళ శిశు సంక్షేమ ప్రకటించిన ఉద్యోగ ప్రకటనల్లో ఆదివాసీలకు ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం చాలా దారుణమన్నారు. ఆదివాసీల హక్కులు, చట్టాల నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గిరిజనేతరులతోనే భర్తీ చేసే ధోరణితో ప్రకటించిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఉత్తర్వులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ట్యాంకర్ బోల్తా- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



బోల్తా పడిన ట్యాంకర్

కొయ్యూరు: మండలంలోని బట్టపనుకుల పంచాయతీ చిన్న కాట్రగెడ్డ సమీపంలో బుధవారం సాయంత్రం కృష్ణాదేవిపేట నుంచి వస్తున్న డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఇక్కడ సమీపంలో చేపడుతున్న జాతీయ రహదారి పనులకు డీజిల్‌ను ట్యాంకర్ తీసుకెళ్లింది. తిరిగి వస్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ సత్తిబాబు, క్లీనర్ వెంకటరావులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆస్పత్రికి తరలించారు.


శ్రీరామనవమి వేడుకలకు సామగ్రి వితరణ



గ్రామస్తులకు సామగ్రి అందజేస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని కుమ్మూరులో నిర్వహించే శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసే పందిరి నిర్మాణానికి స్థానిక ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ సామగ్రిని వితరణగా అందజేశారు. ఆయనను బుధవారం గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున సిమెంటు రేకులు, ఐరన్ పైపులను అందజేశారు. గ్రామస్తులు చంద్రయ్య, నగేష్, అర్జున్, దుర్గయ్య, శశాంక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సంతబైయలు హోలీ క్రీడా మైదానంలోని కాలనీలో నీటి సమస్యను స్థానిక ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి దృష్టికి పలువురు తీసుకువెళ్లారు. ఆయన బుధవారం ఆయా కాలనీలోని వీధుల్లో పర్యటించారు. తాగునీటి పథకాలు, పాడైన బోరులను పరిశీలించారు. కొద్ది రోజులుగా తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని, బోరు పనిచేయక, నీటి పథకాలు ద్వారా నీటి సరఫరా లేక రోజూ నానా అవస్థలు పడుతున్నామని ఎంపీడీవోకు స్థానికులు సమస్యను విన్నవించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దారుణ దారులు



కాలినడక వెళ్తున్న గ్రామస్తులు



సలుగు రోడ్డు దుస్థితి



అధ్వాన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు

- అధ్వానంగా సలుగు రోడ్డు
- గోతులు, రాళ్లు తేలిన రహదారులతో ఇక్కట్లు
- వాహనచోదకులకు తప్పని పాట్లు
- పట్టించుకోని అధికారులు

పాడేరు రూరల్:

ఏజెన్సీలో చాలా గ్రామాల్లో ప్రస్తుతం రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పెద్ద పెద్ద గోతులు, రాళ్లు తేలిన రహదారులు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు పైబడినా ఏజెన్సీ ప్రాంతంలో ఒక్క రోడ్డు బాగు చేయకపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో సలుగు పంచాయతీ రహదారి దారుణంగా ఉంది. రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్న ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. సలుగు పంచాయతీ కేంద్రం నుంచి పరిసర గ్రామాలకు సుమారు 10 నుంచి 15 కిల్లోమీటర్లు వరకు విస్తీర్ణం ఉంటుంది. ఈ పరిధిలో ఉన్న సుమారు 12 గ్రామాల ప్రజలకు సరైన రహదారి లేకపోవడంతో రవాణా సదుపాయం కరువైంది. ఆయా గ్రామస్తులకు అత్యవసర సమయాల్లో 108, 104, అంబులెన్స్ సేవలు అందని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామస్తులు పాడేరు మండల కేంద్రానికి వచ్చేందుకు సుమారు 35 కిల్లోమీటర్లకు పైబడి ప్రయాణించాల్సి వస్తోంది. కొంతదూరం వరకు కాలినడకన రావాల్సి వస్తోందని, అక్కడి నుంచి బస్సు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లు తేలిన రోడ్డుతో నిత్యం వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ఈదులుపాలెం నుంచి సలుగు మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటుందని, రహదారి చిత్తడిగా మారడంతో జారిపడుతున్నామని, పెద్ద పెద్ద గోతుల్లో పడి గాయాలపాలవుతున్నామని వాపోతున్నారు. ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారిని పూర్తిస్థాయిలో నిర్మిస్తే సలుగు పంచాయతీ పరిధిలో గల లోలంగిపాడు, రంగశింగిపాడు, రెలామామిడి, మాలపాడు, బిడ్డరిగరువు, చీడిమెట్ట, బోడ్డిచట్టు, బురదపాడు, తూరు మామిడి తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో తేజరత్నం మాట్లాడుతూ సలుగు పంచాయతీలో రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే రహదారి పనులు చేపడతామన్నారు.

రహదారికి మోక్షమెన్నడో



మా గ్రామ రహదారికి మోక్షం ఎపుడు కలుగుతుందో. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీలు ఇచ్చినా అమలు చేయలేదు. రోడ్డు సమస్యల నేటికీ పరిష్కరించలేదు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలి. రహదారి నిర్మాణానికి నిధులు మంజురు చేయాలి.

– జి.అప్పారావు, సలుగు పంచాయతీ, పాడేరు మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



మా గ్రామంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అధికారులకు విన్నవించుకొని విసిగి పోయాం. అధ్వాన రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ బస్సు సేవలు అందని పరిస్థితి ఉంది. ప్రైవేట్ వాహనాలే గతి. పెద్ద పెద్ద గోతులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మోక్షం కల్పించండి.

– టి.కొండబాబు, గ్రామస్తుడు, రెలామామిడి

వ్యవసాయశాఖ భవనాల మరమ్మతుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



ఏడీ కంటా జాహ్నవి

చింతపల్లి: చింతపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న భవనాలకు అవసరమైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తామని చింతపల్లి వ్యవసాయ శాఖ ఏడీ కంటా జాహ్నవి అన్నారు. ఈనెల 2వ తేదీన 'సాక్షి'లో 'నిర్మాణాలపై నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏడీ జాహ్నవి మాట్లాడుతూ చింతపల్లిలో వ్యవసాయశాఖకు సొంత భవనాలు, గోదాములు ఉన్నాయన్నారు. ఇవి చాలా కాలం కిందట నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు వినియోగంలో ఉండడంతో విత్తనాలు, ఎరువులు, పరుగు మందులు వంటివి అక్కడే నిల్వ చేస్తున్నట్టు తెలిపారు. పాడైన భవనాల మరమ్మతు కోసం నిధులు విడుదల చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్టు ఏడీ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: విద్యుత్ లైన్‌లకు మరమ్మతు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈ ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజనల్ చింతపల్లి మండల సబ్ స్టేషన్ అన్నవరం ఫీడర్ పరిధిలోని లోతుగెడ్డ, బలపం, గూడెం కొత్తవీధి మండలంలో లంకపాకలు, జి.మాడుగుల మండలంలో కొక్కిరపల్లి ఫీడర్ పరిధిలో పలమామిడి, వంజరి, గెమ్మెలి, పాడేరు మండలంలో కిండంగి సబ్‌స్టేషన్ పరిధిలో వంట్లమామిడి మినుములూరు, మల్కాపురం, డల్లాపల్లి, ముంచంగిపుట్టు మండలంలో మాకవరం ఫీడర్ పరిధిలో కించయిపుట్టు, కొయ్యూరు మండల సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్.కంతరం, నిమ్మలపాలెం, మంప, అరకులోయ మండల సబ్‌స్టేషన్ హట్టగుడ ఫీడర్ పరిధిలో మాదల, చినలబుడు, ఇరగాయి, అనంతగిరి మండలంలో భీసుపురం ఫీడర్ పరిధిలో ఎగుసోభ, మర్రిగుడ, బూరజోల, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల ఉంటుందని, వినియోగదారులందరూ గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జి.మాడుగుల: మండలంలో పలు సచివాలయాల్లో ప్రత్యేక అధార్ కేంద్రాలను ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో డేవిడ్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డుల బయోమెట్రిక్ అప్‌డేట్స్, కొత్త కార్డుల నమోదు, డాక్యుమెంట్స్ అప్‌లోడ్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరి అన్నారు. ఆధార్ ఆవశ్యకతపై చిన్నారుల తల్లిదండ్రులకు మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కోరాపల్లి సచివాలయంలోను, 8 నుంచి 11వ తేదీ వరకు గడుతూరు సచివాలయంలో నిర్వహిస్తారని, 9492888753కు సంప్రదించాలని, ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు గెమ్మెలి సచివాలయంలోను, 8 నుంచి 11వరకు వంజరి సచివాలయంలో నిర్వహిస్తారని, 9391542036 నంబర్‌కు సంప్రదించాలని, ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు బొయితిలి సచివాలయంలోను, ఈ నెల 8 నుంచి 11వరకు సుర్మతి సచివాలయంలో నిర్వహిస్తారని, 9494247148 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్యభద్రతపై అవగాహన



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకోవడం వల్ల తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కిముడు గీతాంజలి అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు ఆరోగ్య భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపరింటెండెంట్ గీతాంజలి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ప్రసవాల వల్ల కలిగే మేలు, ఇంటి వద్ద ప్రసవాలతో కలిగే ఇబ్బందులను, అవస్థలను వివరించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిముడు గీతాంజలి మాట్లాడుతూ ఆరోగ్యమైన శిశువు కోసం గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పండ్లు, ఆకుకూరలు, పప్పు,మాంసము, చేపలు వంటివి తీసుకుంటే మంచిదన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యులను సంప్రదించి, పరీక్షల చేసుకుంటూ, మందులు వినియోగించాలని సూచించారు. రక్తహీనత ఉన్న గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ వైద్యం అందిస్తామన్నారు. గర్భిణులు పాటించే జాగ్రత్తల వల్ల శిశువులో రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందన్నారు. ప్రతి గర్భిణి వైద్యుల సూచనలు పాటిస్తూ, తగు జాగ్రత్తగా ఉంటూ ఆరోగ్యకరమైన శిశువుకు జన్మ ఇవ్వాలని కోరారు. సీహెచ్‌సీ వైద్యులు సంతోష్, ధరణి, హెడ్ నర్స్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



చింతపల్లిలో రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ రవికుమార్



జీకే వీధిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: మండలంలోని రేషన్ కార్డదారులు విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బి.రవికుమార్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ మండలంలో 65,410 మంది రేషన్ కార్డుదారులకు గాను 58,400 మంది ఈకేవైసీ చేయించుకోగా, మిగిలిన వారి ఈకేవైసీ ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయించాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే మే నెలలో రేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 1100 భూ సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రేషన్‌కార్డుదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. ఆయన మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించి ఈకేవైసీకి సంబంధించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రానున్న రోజుల్లో రేషన్ పంపిణీ నిలిచిపోతుందన్నారు. సచివాలయాలు, ఆధార్‌కేంద్రాలు, ఎండీయూ వాహనాలు, వీఆర్వోల వద్ద ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ కోరారు.

ఆశీల వసూలుకు వేలంపాట

హుకుంపేట: వారపు సంత ఆశీల వసూళ్లు వేలంపాటలో కాసుల గోవిందరావు అనే వ్యక్తి రూ.1,31,500లకు కైవసం చేసుకున్నట్టు సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యలయంలో బుధవారం సంత ఆశీల వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం వారపు సంత నిర్వహణ నిమిత్తం ఆశీల వసూలుకు వేలంపాట నిర్వహించగా కాసుల గోవిందరావు అనే వ్యక్తి కైవసం చేసుకున్నట్టు చెప్పారు. ఈవోపీఆర్డీ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధ్రువపత్రాల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తల ధ్రువపత్రాలను సీడీపీవో విజయకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, త్వరలో ఆయాల ధ్రువీకరణ పత్రాలను సైతం పరిశీలిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమె బాల సంజీవిని యాప్‌పై కార్యకర్తలకుఅవగాహన కల్పించారు.

అక్రమ నిర్మాణ పనుల నిలుపుదల



కించుమండలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

డుంబ్రిగుడ: కించుమండ పంచాయతీ కేంద్రంలో ఓ గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని కించుమండ గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన సంగతి విదితమే. దీనిపై మండల రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, పనులను నిలుపుదల చేశారు. నిర్మాణదారులకు నోటీసులు అందజేశారు. దీన్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. గ్రామస్తుల ఫిర్యాదు చేసిన వెంటనే పరిశీలించి, నోటీసులు ఇచ్చామని కానీ దీన్ని బేఖాతరు చేస్తూ అక్రమంగా వాణిజ్య సముదాయంతో పాటు గృహ నిర్మాణాలు చేపట్టారని వారు చెప్పారు. గిరిజనుడి భూమిని ఒక గిరిజనేతరుడు ఎలా కొనుగోలు చేశారని, ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్ఐ రాజు తెలిపారు. వీఆర్వో కె.సింహాచలం, మండల సర్వేయర్, నాయకులు చిరంజీవి, రామునాయుడు తదితరులున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా విచారణ చేయాలి



అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అడ్డతీగల: ఏఎస్ఆర్ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో అడ్డతీగలలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగలలోని ప్రధాన వీధుల మీదుగా నిర్వహించిన ఈ ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టి నినాదాల చేస్తూ ముందుకు సాగారు. మతసామరస్యాన్ని కాపాడండి...మతం కాదు మానవత్వం ముద్దు అని నినాదాలు చేశారు. క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ పారదర్శకంగా విచారణ చేయాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు నిస్సీకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా జాయింట్ సెక్రటరీ విక్టర్ ఇమ్మానుయేల్, సెక్రటరీ కె.జెకర్యా తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలుపుతూ మండల పాస్టర్ ఫెలోషిప్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల పాస్టర్ ఫెలోషిప్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.జె.ఎలీషారావు, తిమోతిలు మాట్లాడుతూ క్రైస్తవులపై అక్రమంగా దాడులు జరుగుతున్న ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. క్రైస్తవులపై కొంతమంది కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇటువంటి సంఘటనలకు పాల్పడటం భయాందోళనకు గురిచేస్తుందన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండ ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్చిలు, పాస్టర్లకు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. పాస్టర్లు జోసఫ్, భాస్కరరావు, బి.మనషే, శ్యామ్యుల్, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈఎంటీ ఆవిర్భావ దినోత్సవం



జడ్డంగిలోని వేడకలో పాల్గొన్న సిబ్బంది

రాజవొమ్మంగి: ఈఎంటీ ఆవిర్భావ దినోత్సవాన్ని జడ్డంగిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈఎంటీ సిబ్బంది కేక్ కట్ చేసి పంచిపెట్టారు.రంపచోడవరం కో- ఆర్డినేటర్ శ్రీనివాస్ డివిజన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈఎంటీ సేవలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ నాగార్జున పాల్గొన్నారు. తమకు ప్రభుత్వం కనీస వేతనం అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎంటీలు కోరారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం



ముంచంగిపుట్టులో కరపత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తదితరులు



చింతపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు,సర్పంచ్ పుష్పలత

ముంచంగిపుట్టు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తదితరులు బుధవారం దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలనుసారం ఏప్రిల్ 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, సింహాచలం తదితరులున్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని బుధవారం జరిగిన వారపు సంతలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ దురియా పుష్పలత పర్యటించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారాన్ని చేపట్టారు. ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను విధిగా వ్యాపారులు పాటించాలన్నారు. ఇకపై పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలు జరిగితే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటితొట్టెల ఏర్పాటుకు చర్యలు



బొడ్లంకలో నీటితొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రాఘవ, ఏపీడీ రాంబాబు



కింద్ర గ్రామంలో నీటితొట్టె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అడ్డతీగల: పశువుల దాహార్తి తీర్చడానికి నీటితొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఉపాధి హామీ అడ్డతీగల క్లస్టర్ ఏపీడీ ఎల్.రాంబాబు అన్నారు. పంచాయతీలోని అనిగేరులో నిర్మించిన నీటి తొట్టెని బుధవారం ప్రారంభించారు. అనంతరం బొడ్లంక, వేటమామిడి గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.35 వేల వ్యయంతో ఒక్కో నీటి తొట్టె నిర్మాణం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి ప్రతి గ్రామంలో నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అరవాలు, బొడ్లంక సర్పంచ్ బోనెం రాఘవ, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో ఉపాధి పథకం ద్వారా నిర్మించనున్న పశువుల తాగునీటి తొట్టె నిర్మాణ పనులను ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు.

మండలంలోని దాదాపు అన్ని పంచాయతీల్లో నీటి తొట్టెల నిర్మాణ పనులు ప్రారంభించినట్టు ఉపాధి ఏపీవో రెడ్డిబాబు తెలిపారు. ప్రతి పంచాయతీకి ఒక నీటితొట్టె మంజూరైనట్టు పేర్కొన్నారు. టీపీ రామలక్ష్మి, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి వారపు సంతలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రతి బుధవారం వారపు సంత సందర్భంగా చింతపల్లి, జీకే వీధి మండలాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు, రైతులు, వ్యాపారస్తులు తరలివస్తుంటారు. గిరిజన రైతులతో పాటు అనేకమంది రోడ్డు కిరువైపులా దుకాణాలు ఏర్పాటుతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ పరిస్థితిలో వాహనాలు రాకపోకలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి పంచాయతీ, రెవెన్యూ, పోలీసు శాఖలు స్పందించి మార్కెట్‌ను వేరే చోటుకు మార్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సమీపంలోని మార్కెట్ షెడ్డులోని సంతను తరలించారు. దీంతో ఈ వారం సంతలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.